# ఆర్యవైశ్యుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నా



ఆర్యవైశ్యుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి


- వర్తక, వాణిజ్య వర్గాల సమస్యలను పరిష్కరిస్తా
- నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు.. ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలే
- బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- జమ్మికుంటలో ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమ్మేళనం

జమ్మికుంట, నవంబర్ 6: హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఆర్యవైశ్యుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని, వర్తక, వాణిజ్య వర్గాల సమస్యలను పరిష్కరిస్తానని బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం జమ్మికుంట పట్టణంలోని సువర్ణ ఫంక్షన్ హాల్‌లో 'ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం' కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దిరెడ్డితో కలిసి పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆర్యవైశ్యులనుద్దేశించి మాట్లాడారు. ఆర్యవైశ్యులు పదిమందికి సాయం చేసేవాళ్లే కానీ, ఎవరికీ అన్యాయం చేయరని పేర్కొన్నారు. తమ వ్యాపారాల్లో బిజీగా ఉంటారని, అలాంటి ఆర్యవైశ్యులను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీలో చేరిన తర్వాత కానీ, ఎమ్మెల్సీ, మండలి విప్‌గా పనిచేస్తున్న కాలంలో ఏ వ్యక్తినైనా ఇబ్బంది పెట్టానా..? చెప్పాలన్నారు. సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని, తనపై కొందరు పనిగట్టుకుని అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోని వ్యక్తికి ఏడు సార్లు అవకాశం ఇచ్చారని, ఒకే ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. పేద ఆర్యవైశ్యుల కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారని, ఇక్కడి ఆర్యవైశ్యుల కోసం సొంత భవనం నిర్మించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. వ్యాపారులకు ఇబ్బందిగా మారిన బ్రిడ్జిని తొలగిస్తానని చెప్పారు. వ్యాపారాలకు అనుకూలంగా ఉండేందుకు ఇండస్ట్రియల్ కారిడార్‌నే ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. గతంలో ఆదరించినట్లే ఇప్పుడు కూడా బీఆర్ఎస్‌ను ఆదరించాలని, కౌశిక్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇన్‌చార్జి పెద్దిరెడ్డి కోరారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటామని, ఈసారి గులాబీ జెండాను ఎగరవేయడంలో కీలకపాత్ర పోషిస్తామని ఆర్యవైశ్య నాయకులు, సంఘం అనుబంధ శ్రేణులు హామీ ఇచ్చాయి. ఇక్కడ హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్లు రాజేశ్వర్‌రావు, గందె రాధిక-శ్రీనివాస్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు భాస్కర్, జమ్మికుంట మిల్లర్ల సంఘం అధ్యక్షుడు రాజమౌళి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు చంద రాజు, కౌన్సిలర్లు లావణ్య, మాధవి, రాజ్‌కుమార్, నాయకులు రాజేంద్రప్రసాద్, మహేశ్ తదితరులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## ఏడుసార్లు గెలిచిన ఈటల అభివృద్ధి చేయలే..

- సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా.. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా
- ఎమ్మెల్సీ, హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి


కమలాపూర్, నవంబర్ 6: ఏడుసార్లు గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అభివృద్ధి చేయలేదని ఎమ్మెల్సీ, హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని గుండేడు, కొత్తపల్లి, కన్నూరు, భీంపల్లి గ్రామాల్లో కౌశిక్‌రెడ్డి శాలినిరెడ్డి దంపతులు ఎన్నికల ప్రచారం చేశారు. పదిహేను ఏళ్లుగా సేవ చేసేందుకే ప్రజల మధ్యలో ఉంటున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి మీకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని వేడుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని చెప్పారు. మాట తప్పకుండా చెప్పిన పనులు చేసి చూపిస్తానన్నారు. పేదల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఆసరా పెన్షన్ల పెంపు, సౌభాగ్యలక్ష్మి పథకంలో మహిళలకు రూ.3వేల భృతి, రూ.400కే గ్యాస్ సిలిండర్, రూ.5లక్షల నుంచి రూ.15లక్షలకు ఆరోగ్యశ్రీ పెంపు, కేసీఆర్ బీమా ఇంటింటి ధీమా పథకంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి బీమా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈటల రాజేందర్ ఉప ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే రెండేళ్లు అయినా నియోజకవర్గానికి ఒక్కసారి రాకపోవడం బాధకరమన్నారు. బీసీబంధు చెక్కులు పంపిణీ చేయకుండా ఈటల రాజేందర్ అడ్డుకున్నట్లు ఆరోపించారు. కౌశిక్‌రెడ్డి సతీమణి శాలినిరెడ్డి మాట్లాడుతూ మీ ఆడబిడ్డగా కొంగుచాపి ఓటు అడుగుతున్నా ఒక్క అవకాశం ఇవ్వండని ఓటర్లను వేడుకున్నారు. నియోజకవర్గ ప్రజల కోసం నిత్యం అందుబాటులో ఉంటూ ఏ కార్యకర్తకు ఆపద వచ్చినా తాను ఉన్నానంటూ మీ ముందుకు వచ్చిన కౌశిక్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఏడాది కాలంగా నియోజకవర్గంలో ఉంటూ ప్రజలను కలుస్తూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు చేసిన అభివృద్ధి పనులు మీ కళ్ల ముందు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి భారీ మెజారిటీతో గెలిపిస్తే కౌశిక్‌రెడ్డి మరింత ఉత్సాహంతో పనిచేస్తాడన్నారు. కన్నూరు గౌడ కులస్తులు ఏకగ్రీవ తీర్మానం చేసి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తామని చెప్పారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన కౌశిక్‌రెడ్డికి అండగా ఉంటామని కన్నూరు గ్రామ గౌడ కులస్తులు ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేస్తామని చెప్పడంతో కౌశిక్‌రెడ్డి గౌడ కులస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు గ్రామాల్లోని యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కల్యాణి, సర్పంచ్‌లు పుల్లూరి రాంచందర్‌రావు, కల్యాణి, పద్మ, లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ వీరమనేని భాస్కర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ సంపత్‌రావు, డైరెక్టర్ సత్యనారాయణరావు, నాయకులు లక్ష్మణ్‌రావు, ప్రభాకర్, తిరుపతిరావు, వలీ, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



గుండేడులో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

## 24గంటల్లోపే కాంగ్రెస్‌కు బిగ్‌షాక్

- సొంత గూటికి చేరిన జమ్మికుంట ఎంపీపీ దొడ్డె మమతాప్రసాద్



జమ్మికుంట ఎంపీపీ మమతకు గులాబీ కండువా కప్పుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

జమ్మికుంట, నవంబర్ 6: 24గంటల్లోపే కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తాకింది. ఆ పార్టీలో చేరిన జమ్మికుంట ఎంపీపీ దొడ్డె మమతాప్రసాద్, సొంత గూటికి చేరారు. బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కరీంనగర్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మమతాప్రసాద్‌కు గులాబీ కండువా కప్పిన వినోద్‌కుమార్, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ, ప్రతిపక్ష పార్టీలు పెడుతున్న ప్రలోభాలకు ఎవరూ లోనుకావద్దని, బీఆర్ఎస్ కన్నతల్లిలాంటిదని పేర్కొన్నారు. ఉద్యమకాలం నుంచి పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలను కాపాడుకుంటామని, పార్టీని కూడా ప్రతి ఒక్కరూ కాపాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే నట్టేట మునిగిపోతామన్నారు. మనమంతా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులమని, కుటుంబంలో బేధాభిప్రాయాలు ఉంటాయన్నారు. వాటిని సరిదిద్దుకుంటూ ముందుకు సాగుదామని, అంతిమంగా గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులను కోరారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం పనిచేస్తామని ఎంపీపీ మమతాప్రసాద్ తెలిపారు. ఇక్కడ జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, తదితరులున్నారు.

## బీఆర్ఎస్‌లో బీజేపీ నాయకుల చేరిక

వీణవంక, నవంబర్ 6: మండలంలోని బేతిగల్ బీజేపీ బూత్ అధ్యక్షుడు సిలివేరు విజయ్ సోమవారం కమలాపూర్‌లో బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారు బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని కౌశిక్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు జేకే, రాపర్తి అఖిల్‌గౌడ్, మహ్మద్ జాని, పిట్టల అనిల్, పొన్నాల రాజేశ్ తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వీణవంక, నవంబర్ 6: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బేతిగల్, కనపర్తి, పోతిరెడ్డిపల్లి, కొండపాక, రెడ్డిపల్లి, ఎలుబాక, మామిడాలపల్లి, బొంతుపల్లి, ఘన్ముక్ల, బ్రాహ్మణపల్లి, కోర్కల్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ సీఈవో ప్రకాశ్‌రెడ్డి, సిబ్బంది సోమవారం ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

## సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉండండి

- బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 6: తెలంగాణ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకునే సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సిటీ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ నేత ఈటల హుజూరాబాద్ అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తన భుజాన వేసుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. 24 గంటల ఉచిత కరెంటు, రెండు పంటలకు సాగునీరు, పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతు సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్న సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రైతులు ఆదరించాలని హుజూరాబాద్ సింగిల్ విండో అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి కొండల్‌రెడ్డి కోరారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కన్నెబోయిన శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి తులసి లక్ష్మణమూర్తి, బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ఇన్‌చార్జి తొగరు శివకుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బీఎస్ ఇమ్రాన్, కొలిపాక సమ్మయ్య, కాసగోని కిరణ్‌కుమార్, కేసరి మధు, దిల్ శ్రీనివాస్, ఎం రాజ్‌కుమార్, అన్నయ్యలింగం, రామస్వామి, రవీందర్ తదితరులున్నారు.

## మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 6: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్-14సంవత్సరాల బాలురు, బాలికలకు అథ్లెటిక్స్ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మీటర్ల పోటీల్లో బాలికల విభాగంలో జే అక్షయ (ఏకశిల స్కూల్)ప్రథమ, టీ గంగోత్రి (జెడ్పీహెచ్ఎస్ పెద్దపాపయ్యపల్లి) ద్వితీయ, 200 మీటర్ల పరుగు పందెంలో జే అక్షయ (ఏకశిల)ప్రథమ, సీహెచ్ అక్షయ (ఎంజేపీ) ద్వితీయ, 400 మీటర్ల పరుగు పందెంలో జే అక్షయ (ఏకశిల)ప్రథమ, జీ హరిణి (జెడ్పీహెచ్ఎస్ చెల్పూర్)ద్వితీయ స్థానాల్లో గెలుపొందారు. అలాగే బాలుర విభాగంలో 200 మీటర్ల పోటీల్లో వీ రాజ్‌కుమార్ (బాలికల హైస్కూల్ హుజూరాబాద్) ప్రథమ, సీహెచ్ హర్షవర్ధన్ (జెడ్పీహెచ్ఎస్ సిర్సపల్లి) ద్వితీయ, 400 మీటర్లలో వెంకటేశ్ (జెడ్పీహెచ్ఎస్ సిర్సపల్లి) ప్రథమ, సీహెచ్ రామ్‌చరణ్ (జెడ్పీహెచ్ఎస్ సిర్సపల్లి) ద్వితీయ, 800 మీటర్స్‌లో జే రాంచరణ్ (బాలికల హైస్కూల్ హుజూరాబాద్) ప్రథమ, సీఎస్ హర్షవర్ధన్ (జెడ్పీహెచ్ఎస్ సిర్సపల్లి) ద్వితీయ స్థానాల్లో నిలిచారని ఎస్జీఎఫ్ హుజూరాబాద్ మండల కార్యదర్శి సొల్లు సారయ్య తెలిపారు.

## హుజూరాబాద్‌లో ఐదు నామినేషన్లు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 6: హుజూరాబాద్ శాసనసభ నియోజకవర్గానికి సోమవారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు తెలిపారు. ఇప్పటివరకు మొదటిరోజు ఒకటి, రెండో రోజు రెండు, మూడో రోజు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయని చెప్పారు.

## ఉపాధి కూలీలకు పని కల్పించాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్

కమలాపూర్, నవంబర్ 6: గ్రామాల్లోని కూలీలకు పని కల్పించాలని డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఉపాధిహామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ నివేదిక నిర్వహించారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023వరకు జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డులను సామాజిక తనిఖీ బృందాలు జీపీల్లో ఆడిట్ చేశాయి. 265పనులకు రూ.3కోట్ల 90లక్షల 11వేల 890 నిధులతో పనులు చేపట్టారు. సంబంధిత రికార్డులను గ్రామాలవారీగా చేసిన ఆడిట్ వివరాలను వెల్లడించారు. రికార్డులు సరిగా నిర్వహించని పంచాయతీ కార్యదర్శులకు రూ.వెయ్యి జరిమానా విధించారు. అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో బాబు, ఎంపీవో విమల, డీవీఓ నర్సింహారెడ్డి, ఎస్టీఎం వేణు, ఎఆర్పీ సురేందర్ ఉన్నారు.